

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
- ప్రజాశక్తితో ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

"ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి. చెత్తాచెదారం లేకుండా మురుగునీరు నిలవకుండా ఉన్నప్పడే వీధుల్లో దుర్వాసన రాదు. దోమలు పెరగవు. అలా లేనప్పడే ఈగలు, దోమలు పెరిగి వాటి కాటుకు గురైన ప్రజలకు డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా లాంటి జబ్బులు వస్తాయి. వర్షాకాలంలో నీరు కలుషితం కావడం వల్ల డయేరియా లాంటివి వస్తాయి. ప్రజల ఆరోగ్యాలు పాడవడానికి కాకుండా జబ్బులు నయం చేసుకోవడానికి ఆసుపత్రులు చేరి డబ్బులు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. అందుకే ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం" అని ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...



ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఎంహెచ్ఓ : నగరంలో జూలై 1వ తేదీ నుండి 15 వరకు 52 వార్డులలో హైపర్ ద్రావణాన్ని 1.10 వేల లక్షల లీటర్లు కేసీ కెనాల్ లో నీళ్ల నిలిచే ప్రదేశాల్లో మంత్రి టీజీ భరత్ సహకారంతో పిచికారి చేయడం జరిగింది. పరిశ్రమల శాఖ, రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ ఉచితంగా హైపో క్లోరైడ్ ద్రావణాన్ని ఇచ్చారు. ప్రతిరోజు 66 డివిజన్లలో ఫాగింగ్ చేస్తున్నాం.

మురుగు కాలువల్లో పేరుకుపోయిన సిల్టును తీస్తున్నారా?

ఎంహెచ్ఓ : మురుగు కాలువల్లో సిల్ట్ తీసేందుకు నెల పాటు 30 మందిని తీసుకొని తీయిస్తున్నాం. 50 మంది కావాలని టెండర్లు పిలిచాం. 10 వార్డులలో సిల్టు తీయడం పూర్తి అయింది. ప్రస్తుతం 16, 24, 37 వార్డులలో సిల్టు తీసే కార్యక్రమం జరుగుతోంది. పెద్ద డ్రెయిన్లలో కూడా పూడిక తీసేందుకు టెండర్లను పిలిచాం. టెండర్ అయిన వెంటనే మిగతా వార్డులలో పూడిక తీసే కార్యక్రమాన్ని మొదలు పెడతాం.

నగరంలో కొన్ని వార్డులలో నీరు కలుషితం అవుతోంది. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంహెచ్ఓ : నగరంలో వర్షాకాలంలో కాలువల్లో నీటి పైపులు ఉన్న ప్రదేశాల్లో పైపులు పాతవి కావడంతో వాటికి రంధ్రాలు పడి నీరు కలుషితం అవుతూ ఉండొచ్చు. వాటిని ఇంజనీరింగ్ విభాగం వారితో సమన్వయం చేసుకొని పైపులు మరమ్మతులు చేసి నీరు కలుషితం రాకుండా పైపులను కాలువలలో లేకుండా చేస్తూ పైపులు పైన ఉండేటట్లు మారుస్తున్నాం. ఇంతవరకు కలుషిత నీటి వల్ల డయేరియా వచ్చిన కేసులు లేవు.

ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించే క్లాప్ డ్రైవర్ల జీతాలు ఎన్ని నెలలు పెండింగ్ ఉన్నాయి?

ఎంహెచ్ఓ : నగరంలో ఇంటింటికి చెత్త సేకరించే క్లాప్ డ్రైవర్ల జీతాలు నవంబర్ వరకు ఇచ్చాం. డిసెంబర్ నెల నుండి నేటి వరకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. మే వరకు బిల్లులు చేసి పంపాం. రెడ్డి ఏజెన్సీ ద్వారా వారికి జీతాలు రావాలి.

నగరంలో పారిశుధ్య కార్మికులు ఎంత మంది పనిచేస్తున్నారు?

ఎంహెచ్ఓ : కర్నూలు నగరంలో పారిశుధ్య, మలేరియాకు సంబంధించి మొత్తం 1070 మంది కార్మికులు పనిచేస్తున్నారు. నగర జనాభాకు అనుగుణంగా మరో 200 మంది పారిశుధ్య కార్మికులు కావాలని ప్రభుత్వానికి లేఖ రాశాం. అనుమతి వచ్చిన వెంటనే టిఎల్ఎఫ్‌ల ద్వారా కార్మికులను తీసుకుంటాం.

నగరంలో ఎన్ని బ్లాక్ స్పాట్‌లు ఉన్నాయి?

ఎంహెచ్ఓ : కర్నూల్ నగరంలో 60 బ్లాక్ స్పాట్‌లు ఉన్నాయి. అక్కడ ఉన్న చెత్తను ఏరోజుకారోజు టిప్పర్ల ద్వారా ఎత్తి గార్గేయపురం డంప్‌యార్డుకు తడి, పొడి చెత్త వేరు చేసి తరలిస్తున్నాం. తడి చెత్త ద్వారా ఎరువును తయారుచేసి ఆ ఎరువును డివైడర్లలో, పార్కులలో ఉన్న మొక్కలకు, చెట్లకు ఉపయోగిస్తున్నాం.

నగరంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది? వాటి నివారణకు ఏం చర్యలు తీసుకున్నారు?

ఎంహెచ్ఓ : కర్నూలు నగరంలో 11,978 కుక్కలు ఉన్నాయి. అందులో 9341 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశాం. మిగిలిన వాటికి ఎక్కడ కుక్కలు ఇబ్బంది పెడుతున్నాయో ఆ ప్రాంతాలను గుర్తించి వాటిని పట్టుకుపోయి గార్గేయపురం డంపింగ్ యార్డ్ వద్ద ఏర్పాటు చేసిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కేంద్రం వద్ద ఆపరేషన్ చేసి అవి కోలుకున్న తర్వాత మళ్ళీ ఏ ప్రాంతం నుండి తీసుకు వెళ్ళామో ఆ ప్రాంతంలోనే తెచ్చి వదిలి వేయడం జరుగుతుంది. ఆపరేషన్ చేసినట్లు కుక్కకు చెవ్వు కత్తిరించడం జరుగుతుంది. మిగిలిన కుక్కలను వీలైనంత త్వరలో పట్టుకొని వెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు అదనంగా ఏర్పాట్లు చేసి మరో డాక్టరును కూడా నియమిస్తాం. ఈ కార్యక్రమాన్ని వెటర్నరీ డాక్టర్ మల్లన్న పర్యవేక్షిస్తున్నారు. నగరంలో చెత్త, పారిశుధ్య సమస్యలు వెంటనే నా దృష్టికి తీసుకువస్తే వాటిని క్లియర్ చేయడానికి కృషి చేస్తాం.



సమస్యలను లేవనెత్తేరా?...

- జిల్లాను వేధిస్తున్న అనేక సమస్యలు
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- నూతన ఎమ్మెల్యేల వైపు ప్రజల చూపు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో ఏళ్ల కాలంగా సమస్యలు తిష్ట వేశాయి. దీంతో జిల్లా వాసులకు అనేక తిప్పలు తప్పడం లేదు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలను నిర్వహించనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 11 మంది టిడిపి ఎమ్మెల్యేలు, ఇద్దరు వైసిపి ఎమ్మెల్యేలు, ఒక బిజెపి ఎమ్మెల్యే ఉన్నారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు అసెంబ్లీలో జిల్లాలోని సమస్యలను లేవనెత్తి వారి పరిష్కారానికి చర్యలు చూపాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు...



తప్పని వలస వెతలు : ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊర్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేతపట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హోళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబైలకు తరలివెళ్లారు. కోసిగి మండలంలో అత్యధికంగా 6వేల కుటుంబాలు వలస బాట పట్టాయి. ఉపాధి పనుల్లో సరైన కూలి దక్కకపోవడంతోనే వలస వెళ్తున్నట్లు వలసదారులు చెబుతున్నారు.

ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు: కరవుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హొసళ్లి , సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008 లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి.

సమస్యలకు నిలయంగా జిల్లా కేంద్రం: జిల్లా కేంద్రం పలు సమస్యలకు నిలయంగా మారింది. శివారు కాలనీలకు తాగునీటి సమస్య పట్టిపీడిస్తోంది. కల్లూరుతో పాటు నూతనంగా నగర పాలక సంస్థ పరిధిలోకి వచ్చి చేరిన గ్రామాలలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో కూడా రెండు, మూడు రోజులకు ఒక సారి నీటిని వదులుతున్నారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. వర్షాలు వస్తే మురుగు నీరు నేలపై పారుతున్నాయి. నగర జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతోనే ఈ సమస్య నెలకొంది.

సాగు, తాగు నీటికి తిప్పలే: ఆలూరు నియోజకవర్గంలో రైతులు వర్షాధారంపై ఆధారపడి జీవిస్తారు. సాగు నీరు లేక పోవడం, సకాలంలో వర్షాలు లేక రైతులు, వ్యవసాయ కార్మికులు ఎక్కువగా సుదూర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. తాగు నీటి కోసం ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సి నుండి ఎత్తిపోతల ద్వారా నియోజకవర్గ ప్రజలకు తాగునీరు అందుతుంది. వర్షాకాలంలో వారానికి ఒకసారి, వేసవిలో 15 రోజుల నుండి 20 రోజులకు నీరు అందిస్తారు. నీటి సమస్య పరిష్కారానికి వామపక్షాల పోరాటంతో చిప్పగిరి మండలంలో 2008లో నగరడోన రిజర్వాయర్‌కు వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేసి వదిలేశారు. దానితో పాటు హాళహర్వి మండలంలోని వేదవతి రిజర్వాయర్ పూర్తి అయితే నియోజకవర్గంలో సాగు, తాగు నీటి సమస్య పరిష్కారం అవుతుంది.

పనులకు నోచని బైపాస్ రోడ్డు: ఆదోని పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి 2005లో అప్పటి సిఎం రాజశేఖర్ రెడ్డి బైపాస్ రోడ్డు మంజూరు చేశారు. భూసేకరణ, నిర్మాణం కోసం రూ.48 కోట్లు మంజూరయ్యాయి. అప్పటి నుండి సర్వే పనులు జరిగాయి తప్ప ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు.

ఉన్నత విద్యాసంస్థలకు నిధుల కొరత: కర్నూలు జిల్లా చుట్టూ అనేక విద్యా సంస్థలు ఉన్నప్పటికీ వాటి నిధుల కొరతతో అభివృద్ధి చెందడం లేదు. రాయలసీమ విశ్వ విద్యాలయంలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టి ఇక్కడ అనేక విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసి ఉన్నత విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విశ్వవిద్యాలయ అభివృద్ధికి రూ 500 కోట్ల నిధులను కూడా కేటాయిస్తే మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని విద్యార్థులు కోరుతున్నారు.

జాడలేని పారిశ్రామికాభివృద్ధి: ఓర్వకల్ పారిశ్రామికవాడలో దాదాపుగా దాదాపుగా 33 వేల ఎకరాల్లో కూడా భూములను గుర్తించింది. ఇప్పటికే గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో అనేక పరిశ్రమలు నెలకొల్పేందుకు సంస్థలు ముందుకు వచ్చి ఒప్పందాలు కూడా చేసుకున్నాయి.

ఇప్పటివరకు ఒప్పందాలు చేసుకున్నటువంటి పరిశ్రమలు ఒక రాయి కూడా వేయలేదు.

ఆర్‌యు హాస్టల్‌లో సమస్యల తీష్ట

-టాయిలెట్స్ గదులకు తాళాలు లేవు-ఆహారం తయారీలో నాణ్యత లోపం

-హాస్టల్ వైపు కన్నెత్తి చూడని చీఫ్ వార్డెన్- చీఫ్ వార్డెన్ పనితీరుపై విసి ఆగ్రహం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : వర్సిటీలోనే హాస్టల్లో విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి అక్కడ ఉన్నటువంటి చీఫ్‌వార్డెన్ కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం పెట్టడం లేదు. ఎట్టకేలకు ఇన్‌ఛార్జి విసి ఎన్‌టికె నాయక్ హాస్టళ్లను సందర్శించడంతో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో రెండు హాస్టళ్లు ఉన్నాయి. బాలుర హాస్టల్లో దాదాపుగా 600 మంది విద్యార్థులు ఉంటున్నారు. బాలికల హాస్టల్‌లో 460 మంది విద్యార్థినిలు ఉంటున్నారు. రెండు హాస్టల్స్‌లో అనేక సమస్యలు విలయ తాండవం చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. బాయ్స్‌హాస్టల్‌లో విద్యార్థులకు రుచి కరమైన పౌష్టికాహారం వడ్డించడం లేదు. నాణ్యత లోపంతో ఆహారాన్ని తయారు చేస్తున్నారు. హాస్టల్లో ఏమైనా చిన్న రిపేర్లు ఉంటే కూడా చేయించే పరిస్థితి లేదు. బాలికల హాస్టల్లో కూడా ఇవే సమస్యలు నెలకొన్నాయి. టాయిలెట్స్ గదులకు అనేక వాటికి తాళం గడియలు కూడా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. హాస్టల్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రమైన వాతావరణం లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. సుదూర ప్రాంతాల నుండి వర్సిటీలో వచ్చి చదువుకునే విద్యార్థులకు హాస్టల్లో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు ఈ విషయాలను చీఫ్ వార్డెన్, డిప్యూటీ వార్డెన్ల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడం లేదు. విద్యార్థులకు నాసిరకమైన వస్తువులతో ఆహారాన్ని తయారు చేస్తున్నారు. విద్యార్థులకు తయారుచేసే ఆహారంలో నాణ్యమైన వస్తువులను వినియోగిస్తున్నట్లు బిల్లులు సృష్టించుకుని నిధులను కాజేసిన దాఖలాలున్నాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.



హాస్టల్లో విసి విస్తృత తనిఖీ : ఇన్‌ఛార్జి విసిగా బాధ్యతలు చేపట్టిన ఎన్‌టికె నాయక్ మూడు రోజులపాటు వరుసగా హాస్టల్లో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్న చీఫ్ వార్డెన్ విశ్వనాథ్ రెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆయనకు చార్జిమెమో ఇవ్వాలని ఇన్చార్జి రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లను ఆదేశించారు. హాస్టల్ చీఫ్ వార్డెన్ పనితీరు మార్చుకోకపోతే కఠినంగా చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. హాస్టల్లో విసి పర్యటన చేస్తున్నా చీఫ్ వార్డెన్ విశ్వనాథ్ రెడ్డి రాకపోవడం కూడా ఆయన ఆగ్రహానికి గురి చేసింది. చివరగా విసి పర్యటన ముగించుకొని వెళ్తున్న సమయంలో అక్కడ చేరుకున్న చీఫ్ వార్డెన్ వ్యవహార శైలిపై మండిపడ్డారు.

తహశీల్దార్లను రిలీవ్ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల నుండి వచ్చిన తహశీల్దార్లను రిలీవ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లాలో పని చేస్తున్న దాదాపుగా 29 మంది తహశీల్దార్లను సొంత జిల్లాలకు పంపుతూ రిలీవ్ చేశారు. ప్రస్తుతానికి మండలాల్లో తహశీల్దార్లుగా అక్కడే పని చేస్తున్న డిప్యూటీ తహశీల్దారులను ఇన్చార్జి బాధ్యతలను అప్పగించాలని ఆదేశాలను జారీ చేశారు.



స్థాయీ సంఘ ఎన్నికకు నాలుగో నామినేషన్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరపాలక సంస్థ స్థాయీ సంఘం కమిటీ సభ్యుల ఎన్నికకు నాలుగో రోజు నాలుగో నామినేషన్ దాఖలైంది. ఆదివారం నగరపాలక కార్యాలయంలో మేనేజర్ చిన్నరాముడికు 15వ వార్డు కార్పొరేటర్ ఎస్.శివమ్మ (టిడిపి) తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, క్లర్క్ జిఎం. శ్రీకాంత్ పాల్గొన్నారు.



నామినేటెడ్ పదవులలో బీసీలకు న్యాయం : మంత్రి హామీ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీలో కురువ కులస్తులకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర బిసిసంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవితమ్మకు కురువ సంఘం నాయకులు విన్నవించారు. ఆదివారం విజయవాడలోని మంత్రి నివాసంలో సంఘం నాయకులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి మెమొరాండం అందజేశారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో కురువ కులస్థులకు న్యాయం చేయాలని కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, కర్నూలు జిల్లా కురవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకె.రంగస్వామి, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు టి.శ్రీలీలమ్మ, టి.విజయలక్ష్మి , జిల్లా ఉపాధ్యక్షులు పెద్దపాడు ధనుంజయ, కొత్తపల్లి దేవేంద్ర, తవుడు శ్రీనివాసులు, కె.వెంకటేశ్వర్లు, కె.నాగశేషులు, కె.మహేష్ తదితరులు వినతిపత్రం అందజేశారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ నామినేటెడ్ పదవుల విషయంలో బిసిలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు కురువ సంఘం నాయకులు తెలిపారు.

కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్



గురుకుల విద్యాలయసంస్థలో ఏళ్లతరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యా యులను రెగ్యులర్ చేయాలని సంఘం నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. ఆ సంఘం కన్వీనర్లు డి.హమీద్, జే.అరుణ కుమారి సీఎంను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమను రెగ్యులరేజేషన్ చేయడం కోసం వైఎస్.రాజశేఖరరెడ్డి ఆమోదంతో ప్రక్రియ ప్రారంభించారన్నారు. తరువాత వచ్చిన ప్రభుత్వాలు క్రమబద్ధీకరణ ప్రక్రియను పరిశీలించేందుకు ఎమ్మెల్సీ కమిటీని నియమించారన్నారు. క్రమబద్ధీకరణకు అంగీకరిస్తూ గతంలో సీఎంలు రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి సంతకం చేశారన్నారు. ఆ తరువాత ఉత్తర్వులు ఇంత వరకు అమలుకు నోచుకోలేదన్నారు. 2024 ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, లోకేష్ తమకు పూర్తి న్యాయం చేసి ఉత్తర్వులు విడుదల చేసేందుకు కట్టుబడి ఉందని తెలిపారని సీఎంకు వివరించారు. తమ సర్వీసుకు న్యాయం చేకూర్చి క్రమబద్ధీకరణ ఉత్తర్వులు విడుదల చేయాలని విన్నవించారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

జర్నలిస్టులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేసిన డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, వారివల్లే ప్రతి ఒక్కరు రాజ్యాంగపరమైన ప్రాథమిక హక్కులను పొందగలుగుతున్నారని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు నగరంలో గురు పౌర్ణమి సందర్భంగా జర్నలిస్టులకు ఆయన నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైందని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా చెప్పబడుతున్న జర్నలిజం పాత్ర ఎంతో గొప్పదని వివరించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని వివరించారు. ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు మొదటగా స్పందించేది జర్నలిస్టులేనని, వారి వల్లే ప్రజలు ప్రాథమిక హక్కులు కాపాడబడుతున్నాయని అన్నారు. మారుమూల గ్రామాల్లో జరిగే సంఘటనలను సైతం ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో జర్నలిస్టులు ఎంతో కషి చేస్తున్నారని చెప్పారు.



తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా జర్నలిస్టులు తమ వత్తి ధర్మాన్ని నెరవేరుస్తున్నారని వివరించారు. కొన్ని సందర్భాలలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎన్నో కుంభకోణాలను వెలుగులోకి తెచ్చిన ఘటనలను ఆయన ఉదాహరించారు. అలాంటి జర్నలిస్టులకు ప్రస్తుతం గుర్తింపు లేని పరిస్థితి నెలకొందని చెప్పారు. సమాజంలో నిస్వార్థంగా ప్రజల కోసం పనిచేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడం ప్రభుత్వాల కనీస బాధ్యత అన్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలని కోరారు. ప్రస్తుతం చాలీచాలని వేతనాలతో జర్నలిస్టులు ఎంతో ఇబ్బందులు పడుతూనే జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నారని, అలాంటి జర్నలిస్టులను ఆదుకునేందుకు తన వంతు ప్రయత్నంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ శంకర్ శర్మ వెల్లడించారు.

పొంచి ఉన్న ప్రమాదం

-మరమ్మతులో హంద్రి బ్రిడ్జి -నత్త నడకన సాగుతున్న పనులు
-అప్రోచ్ రోడ్డు లేకే ప్రమాదాలు-పట్టించుకోని పాలకులు, అధికారులు


ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరం గుండా హైదరాబాద్ - బెంగళూరు వెళుతున్న జాతీయ రహదారిలో నిర్మించిన హంద్రీబ్రిడ్జి శిథిలావస్థకు చేరుతుండడంతో వాటి మరమ్మతు పనులను హైవే అధికారులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో బ్రిడ్జి సగం మార్గాన్ని మూసివేసి కుంగిపోయిన బ్రిడ్జి మరమ్మతు పనులను ప్రారంభించారు. బ్రిడ్జి పొడవునా సగభాగంలో రోడ్డును తవ్వేశారు. ఈ నేపథ్యంలో వాహనాలు మిగిలిన ఆ సగభాగంలోనే ప్రయాణించాల్సి రావడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్న వైనం ప్రస్తుతం అక్కడ కనిపిస్తోంది. హైవే అథారిటీ అధికారులు, కాంట్రాక్టరు, ప్రజాప్రతినిధులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. వెంటనే స్పందించకుంటే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పెను ప్రమాదాలు జరగకముందే స్పందించాలి.


హైవే బ్రిడ్జి మరమ్మతు పనులు నత్త నడకన నెలల తరబడి సాగుతున్నాయి. ఈ పనుల పట్ల వాహనదారులు నుంచి విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. గతంలో ఈ పనులను రెండు నెలలపాటు నిర్వహించడంతో పూర్తిగా ఈ బ్రిడ్జిపై రాకపోకలను అప్పట్లో నిలిపివేశారు. మే నెలలో వాహనాల రాకపోకలను అనుమతించారు. పనుల్లో నాణ్యత లోపం కారణంగా బ్రిడ్జి మళ్ళీ కుంగిపోయింది. దీంతో గత రెండు రోజుల నుంచి ఈ పనులను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈ బ్రిడ్జిపై వాహనాలు రాకపోకలకు అంతరాయంగా మారి పెద్ద ఎత్తున బారులు తీరుతున్నాయి. మరమ్మతులు సాగుతున్న ఈ బ్రిడ్జిపై వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగించాల్సి వస్తోంది. ఇక్కడ ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

అప్రోచ్ రోడ్డు లేక ప్రమాదాలు ప్రాణాలు గాలికి

గతంలో ఈ బ్రిడ్జి మరమ్మతుల కాలంలో బ్రిడ్జి పై రాకపోకలను నిషేధించడంతో అప్రోచ్ రోడ్డు లేకపోవడం కారణంగా కేవలం కొత్త బ్రిడ్జిపైనే రాకపోకలు సాగించాల్సి వచ్చింది. వాహనదారులు ఆ బ్రిడ్జి పైనే ప్రయాణం సాగించడం కారణంగా అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇందులో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్ర గాయాల పాలయ్యారు. హైవే రోడ్డు కావడం కారణంగా ప్రతిరోజు వేలాది వాహనాలు, భారీ వాహనాలు ఈ దారిలోనే ప్రయాణం సాగిస్తుండడం వల్ల ప్రమాదం మరింత పొంచి ఉంది. నేపథ్యంలో జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు దీనిపై దృష్టి సారించి బ్రిడ్జిలకు అనుబంధంగా అదనంగా అప్రోచ్ రోడ్డును నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హైవే ఇరువైపులా రోడ్డుకు ఇరువైపులా మట్టితో నింపారు. ఈ మట్టి వర్షానికి కొట్టుకుపోయి గుంతలు పడడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. విషయం చిన్నదైనా జరిగే ప్రమాదం పెద్దదిగా ఉంటుంది. తాత్కాలికంగా వెంటనే రోడ్డు వెంట ఇరువైపులా మట్టితో గుంతలను పూడ్చాల్సిన అవసరం కూడా ఉంది.



మరమ్మతు పనులు వేగంగా పూర్తి చేయాలి



కల్లూరు నుంచి కృష్ణానగర్‌కు వెళ్లే బ్రిడ్జి నిర్మాణ పనులు ఆలస్యంగా సాగుతున్నాయి. రాకపోకలు ఇబ్బందిగా ఉన్నాయి. రోడ్డు మరమ్మతు పనులు నెలల తరబడి కొనసాగిస్తున్నారు. వేగంగా పూర్తి చేయాలి.

కృష్ణ,ఆటో డ్రైవర్, కల్లూరు.

భయం భయంగా ఉంది



బ్రిడ్జి మరమ్మత్ పనులలో భాగంగా సగం బ్రిడ్జి పొడవునా రోడ్డుపై గుంతలు తవ్వుతున్నారు. బ్రిడ్జి పైన పోవాలంటే భయం వేస్తోంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

–బాష, కల్లూరు స్థానికుడు

అప్రోచ్ రోడ్డును నిర్మించాలి

హంద్రీ బ్రిడ్జికి సమాంతరంగా అదనంగా అప్రోచ్ రోడ్డును వేయడం అధికారులు విస్మరించారు. ఏళ్లు గడిచినా బ్రిడ్జి నిర్మాణాన్ని పాలకులు పట్టించుకోలేదు. ప్రమాదాల కారణంగా అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. హైవే అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించాలి.



ఇ.పుల్లారెడ్డి, పిపిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు

వ్యాపారులు ఎవరికీ భయపడనవసరం లేదు

- ఎమ్మెల్యే పార్థసారధి

ప్రజాశక్తి -ఆదోని రూరల్

డివిజన్ కేంద్రమైన ఆదోనిలో వ్యాపారులు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, నచ్చిన వ్యాపారం చేసి స్థానికులకు ఉపాధి కల్పించాలని, అండగా నేనుంటానని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. ఆదివారం పట్టణ శివారులోని వినాయక గ్రానైట్ దుకాణాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదోనిలో అన్ని రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని పెట్టుబడి దారులను, ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వ్యాపారస్తులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గతంలో వ్యాపార కేంద్రంగా ఉన్న ఆదోనిలో ప్రస్తుతము పరిశ్రమల లేక ఉపాధి కరువై సుదూర ప్రాంతాలకు యువత వలస పోతున్న పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం నుండి ఎలాంటి సాయం కావాలన్నా తాను సమకూరుస్తానన్నారు. వ్యాపారస్తులు పెట్టబడి పెట్టడం వల్ల స్థానిక నిరుద్యోగులు, కూలీలకు ఉపాధి లభిస్తుందని అన్నారు. నిరుపేద కుటుంబాలను ఆదుకోవడంతోపాటు ఆదోని అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఇక్కడ వ్యాపారాలు చేయాలంటే ఎంతో ఇబ్బందులు ఉండేవని, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అనుచరులకు మామూలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదని అన్నారు.


గ్రానైట్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఆదోని ఎమ్మెల్యే ప్రార్థసారధి

అలాంటి వాతావరణానికి స్వస్తి పలికి స్వచ్ఛ వాతావరణంలో వ్యాపారం చేసుకోవచ్చని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు కునగిరి నీలకంఠ, యాజమాని అశోక్ తదితరులు ఉన్నారు.

రెండేళ్లయినా పూర్తికాని ప్రభుత్వ భవనాలు

- బిల్లులు చేతికి రాక ఆపేసామంటున్న కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వాలు ప్రజలకు అన్ని వసతులు సమకూర్చడానికి గ్రామీణ ప్రాంతాలలో అనేక ప్రభుత్వ భవనాలను కోట్ల నిధులు వెచ్చించి నిర్మాణాలు చేపడుతోంది. కానీ మధ్యలో నిర్మాణాలు ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది. బిల్లులు సరిగా రావడంలేదని కాంట్రాక్టర్లు తెలుపుతున్నారు. ఇంకో పక్కన ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఒక ప్రభుత్వం చేపట్టిన నిర్మాణమును మరో ప్రభుత్వము చేపట్టలేక ఆ నిర్మాణం అంతటితోనే ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందని ప్రజలు పేర్కొంటున్నారు. మండలంలో గత వైసిపి ప్రభుత్వం సచివాలయాలు, ఆర్‌బికేలు, విలేజ్ క్లీనిక్‌లు, పాఠశాలలో నాడు - నేడు పథకము కింద పాఠశాలలు మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణాలకు కోట్ల నిధులను మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టింది. అయితే వాటిలో కొద్ది వరకు నిర్మాణాలు పూర్తి అయ్యాయి. బిల్లులు అందక ఆగిపోయిన వాటిలో రామదుర్గం, బెల్డోన, డేగల హాల్, గుమ్మనూరు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. నేమకల్లులో 90 శాతం పూర్తి అయినా 10 శాతం ఆర్‌బికే నిర్మాణము నిలిచిపోయింది. చిప్పగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో నాబార్డ్ పథకం కింద అదనపు గదుల నిర్మాణమునకు నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో గదులు నిర్మించడానికి ప్రజా ప్రతినిధులు ఆర్భాటంతో పూజలు నిర్వహించారు. అయితే అక్కడ ఉలుకు పలుకు లేకుండా పునాదులు తీసి పిల్లర్లు మాత్రమే వేయించగలిగారు. రెండేళ్లు కావస్తున్న పునాదులే దర్శనమిస్తున్నాయి. అయితే అక్కడ


చిప్పగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో పునాదులకే పరిమితమైన అదనపు గదులు

విద్యార్థులు ఆటలు ఆడుకునే సమయంలో పునాదులు దగ్గరకు వస్తే ఆ పునాదులలో పడే ప్రమాదం ఉందని హెచ్‌ఎం పదేపదే ఉన్నత అధికారులకు తెలియజేస్తున్నా ఎవరు పట్టించుకోవడంలేదని హెచ్‌ఎం విన్నవించిన సందర్భాలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలో నాడు నేడు కింద వచ్చిన నిర్మాణాలు కూడా మధ్యలో ఆగిపోయాయని పలు పాఠశాలల ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వ నిధులు వృధా కాకుండా ఆగిపోయిన నిర్మాణాలన్నీ కూడా కొత్త ప్రభుత్వం, మరియు ఉన్నతాధికారులు ఒక నివేదికను తెప్పించుకొని వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మొక్కలు నాటి పర్యావరణం కాపాడుకుందాం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మొక్కలు నాటడం అవసరమని మొక్కలు నాటడం వల్ల కాలుష్యాన్ని అరికట్టేందుకు సాధ్యపడుతుందని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్మిగనూరు డిపో అసిస్టెంట్ మేనేజర్ జివి. నాగరాజు డిపోలోని ఉద్యోగులందరినీ కోరారు. ఆదివారం ఉదయాన్నే ఆయన సెక్యూరిటీ బ్రాంచ్ దగ్గర పసుపు మందారం మొక్కను నాటారు. ఎడిసి ఎర్రి స్వామి పాల్గొని డిపో ఆవరణంలో మొక్కలను నాటారు. డిపో మేనేజర్ అమర్నాథ్ పాణ్యం నుండి నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి ముస్తాక్ అహ్మద్ ద్వారా తెప్పించారు. పర్యావరణాన్ని కాపాడడం మనందరి బాధ్యతని అసిస్టెంట్ మేనేజర్ ఈ సందర్భంగా తెలిపారు.


మొక్కలు నాటుతున్న ఎమ్మిగనూరు ఆర్‌టిసి డిపో అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు

టీకాలతో ఆరోగ్య రక్ష

- ప్రతి బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్ - విలేజ్ క్లినిక్‌లలో టీకాలు అందుబాటులో

ప్రజాశక్తి-ఆదోని రూరల్

గర్భిణీ స్త్రీలు, శిశువులు తప్పనిసరిగా టీకాలు వేసుకుంటే ఆరోగ్యానికి రక్ష ఉంటుందని వైద్యులు తెలియజేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మొదలుకొని పట్టణ ప్రాంతాల వరకు ఏ ఒక్క శిశువు, చిన్నారిని వదలకుండా గ్రామాల్లో తరచూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి టీకాలు వేస్తున్నారు. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్య శాఖ ఏటా టీకాస్త్రం ఉపయోగిస్తోంది. ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించేందుకు ప్రభుత్వం లక్ష్యం మేరకు అందరికీ టీకాలు ఉచితంగా వేస్తోంది. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏ చిన్న జబ్బు చేసినా ప్రజలు ఇబ్బందులు పడేవారు. అవగాహన లేకపోవడంతో వ్యాధి నిరోధక టీకాలు వేసుకునేందుకు చాలా మంది భయపడేవారు. ఆ భయాన్ని వీడేలా అధికారులు అవగాహన కల్పించడంతో వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తవుతోంది.

ఆదోని మండలం పరిధిలో 3 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 37 గ్రామ సచివాలయాల్లో ఒక ఏఎన్‌ఎం, ఒక ఎంఎల్‌హెచ్‌పి, ఆయా గ్రామాలలో ఆశ వర్కర్లు అందుబాటులో ఉండి, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతి బుధ, శనివారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి. గర్భిణులు, శిశువులు, చిన్నారులకు ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు వేయిస్తే వ్యాధులు దరి చేరవని వైద్యులు చైతన్యం చేస్తున్నారు. జీవితాంతం ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపేందుకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పిస్తున్నారు.

టీకాలు వేసేదిలా..

గర్భిణిగా నిర్ధారణ అయిన మూడు నెలల తర్వాత టీటీ ఇంజెక్షన్


టీకాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య అధికారులు

వేయించుకోవాలి. నెల రోజుల వ్యవధిలో మరో టీటీ వేస్తారు. వీటితోపాటు ఐరన్, ఫోలిక్ యాసిడ్, క్యాల్షియం ట్యాబ్లెట్లు ఇస్తారు. మహిళ ప్రసవానంతరం ఐరన్ ట్యాబెట్లు అందజేస్తారు. చిన్నారులకు 9 నెలల నుంచి ఐదేళ్ల వయస్సు వరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి విటమిన్-ఏ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు వేయించాలి. అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్-బి డోస్ వేయించాలి. దీంతో పోలియో, పచ్చకామెర్ల వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి. ఆరు నుంచి 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి. వీటితో పాటు 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటావాలెంట్ వేయించాలి. కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చకామెర్ల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. 9 నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి, మీజిల్స్, కంటి,చర్మ వ్యాధులు రాకుండా విటమిన్-ఏ చుక్కలు వేయించాలి. 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోసు, టీపీటీ, మీజిల్స్, విటమిన్-ఏ ఓపీని వేయించాలి. ఐదేళ్లు పూర్తయిన తర్వాత డీపీటీ డోసు, 10-16 సంవత్సరాలు పూర్తయితే టెటనస్ టాక్సైడ్ (టీటీ) వేయించాలి.

వలసల నివారణకు చర్యలు తీసుకోవాలి


ఎస్ఇకి వినతిపత్రం ఇస్తున్న పి.సాయిబాబా

ప్రజాశక్తి - ఆదోని

మంత్రాలయం నియోజకవర్గంలో వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి పి సాయిబాబా కోరారు. ఆదివారం జిల్లా కలెక్టర్‌కు, నీటిపారుదల శాఖ సూపర్డెంట్ ఆఫ్ ఇంజనీర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం నుంచి ఆంధ్రప్రదేశ్ వాటాగా 734 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉండగా ఎల్ఎల్‌సి ద్వారా కేవలం 250 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తున్నాయన్నారు. సుమారు 200 టీఎంసిల నీరు వృధాగా సముద్రంలో కలుస్తున్నాయన్నారు. ఈ నీటిని వాడుకోవడానికి గుంతకల్ బళ్లారి రహదారిలో హగరి వద్ద ఒక ప్రాజెక్టు నిర్మించి గ్రావిటీ ద్వారా వేదావతి ప్రాజెక్టుకు అనుసంధానం ఏసి 60 టిఎంసిల నీటిని కర్నూలు జిల్లాకు కేటాయిస్తే సుమారు ఆరు లక్షల ఎకరాలకు నీటి సౌకర్యం కలుగుతుందన్నారు. ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో రిజర్వాయర్లు నిర్మిస్తే కర్నూలు జిల్లా మొత్తం నీటి సౌకర్యం ఏర్పడుతుందన్నారు. ఎల్ఎల్‌సి కెనాలకు 50 కిమీ వద్ద కర్నాటక సిరిగేరి గ్రామం నుంచి ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో 251 కిమీ హనవాలు గ్రామం వరకు షార్ట్ కట్ అండర్ గ్రౌండ్ పైపు లైను నిర్మించి ఎల్ఎల్‌సికి అనుసంధానం చేయాలన్నారు. కౌతాళం మండలం, మ్యాళిగనూరు వద్ద భారీ స్థాయిలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు తుంగభద్ర నదిపై నిర్మిస్తే సుమారు రెండు లక్షల ఎకరాలకు నీటి వసతి కలుగు తుందన్నారు. ఆర్‌డిఎస్ 4 టిఎంసిల నీటి కోసం నిర్మిస్తున్న ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. వేదావతి ప్రాజెక్టు నిర్మాణం కొనసాగించాలన్నారు. కౌతాళం నుంచి సి బెళగల్ వరకు తుంగభద్ర నదిపై 11 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల సామర్థ్యాన్ని పెంచి అదనంగా నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ఒక్క కర్నూలు పార్లమెంట్ 7 నియోజకవర్గాలకు 150 టిఎంసిల నీరు అవసరముండగా కేవలం 10 టిఎంసిల నీరు మాత్రమే అందుతున్నాయన్నారు.

స్వర్ణ మయమైన రాఘవేంద్రుని బృందావనం

ప్రజాశక్తి - మంత్రాలయం:ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మూల బందావనం స్వర్ణమయమై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా రాఘవేంద్రుని బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణ కవచాలతో పట్టు వస్త్రాలతో వివిధ రకాల పూల మాలలు వేసి అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకొని నైవేద్య సమర్పణలో మంగళ హారతులు ఇచ్చారు. అంతకు ముందు పీఠాధిపతుల ఆశీస్సుల కోసం వేచి ఉన్న భక్తులను శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.



జెఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- ఎమ్మెల్యేకు యుఈఈయు వినతి

ప్రజాశక్తి - ఆలూరు

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న జూనియర్ లైన్ మెన్ గ్రేడ్ - 2 ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేసి అసిస్టెంట్ లైన్ మెన్ గా పదోన్నతి కల్పించాలని యునైటెడ్ ఎలక్ట్రాసిటి ఎంప్లాయ్స్ యూనియన్ డివిజన్ అధ్యక్ష,కార్యదర్శి కె.దేవేంద్రప్ప, యం.నాగేంద్రప్ప కోరారు. ఆదివారం నియోజకవర్గ ఎంఎల్‌ఎ బుసినే విరుపాక్షికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం లో 2019 అక్టోబర్ నెలలో విద్యుత్ శాఖలో 7,329 మంది జెఎల్‌ఎం గ్రేడ్ - 2 ఉద్యోగులుగా నియమింపబడ్డామని, ఆపరేషన్, మేయింటినెన్స్‌లో రెగ్యులర్ ఉద్యోగులతో పాటు తాము వినియోగదారులకు సేవలందిస్తున్నమని, నాలుగేళ్లైనా రెగ్యులర్ చేయకపోవడం ఆందోళన కలిగించిందన్నారు. సోమవారం నుండి జరిగే అసెంబ్లీ సమావేశంలో తమ సమస్యలపై చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఏపిఎస్‌ఈబి సర్వీస్ రెగ్యులెన్స్ ప్రకారం పదోన్నతి కల్పించి న్యాయమైన



డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ ఖలందర్, జెఎల్‌ఎంలు వెంకటేష్, వీరేష్, విజయ్, మంజు, గాదిలింగప్ప, సుంకప్ప, బసవరాజు, రవితేజ పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.6లక్షల విరాళం

-మేనేజర్ ఎస్‌కె. శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మంత్రాలయం



ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో జరుగుతున్న అన్నదానానికి భక్తుల నుంచి రూ.6లక్షల విరాళాలు వచ్చినట్లు శ్రీ మఠం మేనేజర్ ఎస్‌కె. శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులకు సమాచారం అందించారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరుకు చెందిన లక్ష్మీ అగ్నిహోత్రి, రూ.2 లక్షలు, వసంత్ ఎన్. పాటిల్ రూ.లక్ష , ముంబై కి చెందిన గౌరీ రాజన్ రూ.2 లక్షలు, చెన్నై కి చెందిన గాయత్రి అన్నదానానికి విరాళంగా ఇచ్చారని వారికి పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారని చెప్పారు. అంతకు ముందు దాతలు స్వామి వారి బృందావనాన్ని దర్శించుకొని మంగళహారతులు స్వీకరించారని పేర్కొన్నారు.

అన్ని రకాల బీమా సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-ఆదోని

భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు అన్ని రకాల బీమా సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఒబి నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోనిలోని సిపిఐ కార్యాలయంలో వైటి భీమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సిపిఎస్‌ను రద్దు రద్దుచేసి ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. ఎఐటియుసి పట్టణ ప్రధాన కార్యదర్శి బి వెంకన్న, ఎఐటిసి జిల్లా సమితి సభ్యులు సి హుసేని, షేక్షావలి, లక్ష్మీనారాయణ, భువన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బెల్దర్ రాము, ఎల్లప్ప, తాయన్న, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు కోసిగి ఈరన్న, ఫర్టిలైజర్ హమాలి సంఘం నాయకులు బి దేవా పాల్గొన్నారు.

జీఓ117ను వెంటనే రద్దు చేయాలి

ప్రజాశక్తి-ఆదోని

పాఠశాల విద్యా వ్యవస్థ గందరగోళానికి కారణమైన జిఒ 117ను తక్షణమే రద్దు చేయాలని ఎస్‌టియు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, జిల్లా కార్యదర్శి గోపాల్, ప్రధానోపాధ్యాయుడు సత్యన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోనిలోని ఎస్‌టియు భవన్‌లో సీనియర్ నాయకుడు అంగడి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాల అకాడమిక్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. పదవ తరగతి పరీక్షలు ఆంగ్లంతోపాటు తెలుగు మాధ్యమంలో నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌టియు జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడు రామాంజనేయులు, ఆదోని మండలం ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు, సీనియర్ నాయకులు హొన్నూరు వలి, గాదిలింగప్ప, రాము, భాస్కర్, మహ్మద్ ఇలియాస్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర ఎవరూ ఉండవద్దు

- ప్రమాదాలు జరగకుండా చర్యలు

ప్రజాశక్తి - చిప్పగిరి

వర్షాలు వస్తుండటంతో ప్రమాదం పొంచి ఉందని, విద్యుత్తు తీగల వద్ద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద, విద్యుత్ స్తంభాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రజలకు విద్యుత్ ఏఈ ఉలిగన్న తెలిపారు. ఆదివారం చిప్పగిరిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో వర్షాలకు విద్యుత్ స్తంభాలకు, ట్రాన్స్ఫార్మర్ల వద్ద కరెంటు సప్లై అయ్యే ప్రమాదం ఉందని దీంతో ప్రజలు గమనించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో ఏదైనా విద్యుత్తు అంతరాయాలు ఉంటే వెంటనే సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలను సంబంధిత ఆయా గ్రామాల లైన్మెన్లలో అప్రమత్తం చేసి తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాలలో ఏదైనా విద్యుత్ అంతరాయం ఏర్పడిన మండల ఏఈ ఫోన్ నెంబర్9440813395, చిప్పగిరి సబ్ స్టేషన్ ఫోన్ నెంబర్ 7382605664, నగరడోన సబ్ స్టేషన్ ఫోన్ నెంబర్ 8712625706 ఈ నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లా విద్యుత్ అధికారుల ఆదేశాల మేరకు ఏ గ్రామాలలో విద్యుత్తు లైన్మెన్లు ఆ గ్రామాల్లో అందుబాటులో ఉంటారని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వరని తెలిపారు.

శ్రీ మఠంలో మృత్తిక సంగ్రహణోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో మృత్తిక సంగ్రహణోత్సవం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆషాడ శుద్ధ గురు పూర్ణిమను పురస్కరించుకుని శ్రీ మఠం నుండి మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ స్వర్ణ పల్లకితో తుంగభద్ర నది తీరంలో ఉన్న తులసి వనం వరకు చేరుకున్న పీఠాధిపతులు మృత్తిక(మట్టి)ని సంగ్రహించి పండితుల వేద మంత్రాల మధ్య విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం సంగ్రహించిన మత్తికను స్వర్ణ పల్లకిలో ఉంచి ఊరేగింపుగా శ్రీ మఠం చేరుకున్న పీఠాధిపతులు



రాఘవేంద్రస్వామి బృందావనం ముందు ఉంచి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బృందావనం పై గత ఏడాది గురు పౌర్ణమి సందర్భంగా ఉంచిన మృత్తిక ను తొలగించి తెచ్చిన కొత్తగా తెచ్చిన మృత్తికను స్వామి వారి బందావన మీద ఉంచి మంగళ హారతులు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీమఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, ఐపి నరసింహ మూర్తి, మఠం సిబ్బంది పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో పతకాలే లక్ష్యంగా పోటీ పడాలి

-గుడ్ లక్ టీం ఇండియా అంటూ క్రీడాకారుల ర్యాలీ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

పతకాలే లక్ష్యంగా ఒలింపిక్స్ పోటీల్లో పాల్గొని అధిక పతకాలు సాదించాలని అభినందనలు తెలుపుతూ కర్నూలులో క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్న ఒలంపిక్స్ క్రీడల్లో మన దేశ క్రీడాకారులతో పాటు మన రాష్ట్ర ఆటగాళ్ల కూడా పతకాలే లక్ష్యంగా ముందుకు వెళ్ళాలని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ చైర్మన్, మాజీ మంత్రి కెఇ. ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అవుట్డోర్ స్టేడియం నుండి కొండారెడ్డి బురుజు వరకు ఒలంపిక్స్‌లో భారత క్రీడాకారులు పతకాలు సాధించుకురావాలని ఆకాంక్షిస్తూ ర్యాలీని నిర్వహించారు. కెఇ.ప్రభాకర్ జెండా ఊపి ర్యాలీని లాంఛనంగా ప్రారంభించారు. ఈ ర్యాలీలో సుమారుగా 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు జగదీష్ కుమార్, జిల్లా ఒలింపిక్ సిఇఒ పి. విజయ్ కుమార్, జిల్లా ఒలింపిక్ కార్యదర్శి శ్రీనివాసులు, ఒలింపిక్ జిల్లా కార్యనిర్వక కార్యదర్శి పి. సునీల్ కుమార్, యోగ సంఘం సభ్యులు శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. అతిథులు మాట్లాడుతూ మన దేశం నుండి పాల్గొంటున్న 117 మంది క్రీడాకారులు ప్యారిస్‌లో జరిగే ఒలంపిక్స్ క్రీడల్లో గత ఒలంపిక్స్ లో కన్నా ఈ ఏడాది అత్యధిక పతకాలను దేశానికి



అందించాలని ఆకాంక్షించారు. ఈ సారి ఆంధ్రప్రదేశ్ నుండి ఏడుగురు క్రీడాకారులు ఒలింపిక్ లో పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడాకారులలో ఔన్నత్యాన్ని పెంచేందుకు , నగరంలో ర్యాలీని నిర్వహించామన్నారు. కాంట్రాక్టర్ నాగేంద్రుడు , రాష్ట్ర యోగ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి, ఉషు అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు, టైక్వాండో జిల్లా కార్యదర్శి సతీష్ , జిల్లా స్కేటింగ్ కోశాధికరి అబూబాకర్, ఫుట్‌బాల్ కోచ్ బ్రహ్మ, కరాటే మాస్టర్ ఆరిఫ్, ఈశ్వర్ నాయుడు పలు క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


కర్నూలులో పురస్కారం అందుకుంటున్న సూర్యనారాయణాచార్యులు

పురస్కారం అందుకున్న సూర్యనారాయణాచార్యులు

ప్రజాశక్తి-మంత్రాలయం

ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేష సేవలు అందించిన మంత్రాలయం గ్రామ నివాసి సూర్యనారాయణాచార్యులు చత్రపతి శివాజీ హైందవ శ్రేష్ఠ పురస్కారం అందుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీజీవి కళాక్షేత్రంలో హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో వ్యాస పౌర్ణమి సందర్భంగా , విద్యాసంస్థల అధినేత కెవి సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఈ గౌరవం అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి , పలువురు ప్రముఖులతో పాటు హిందూ ఉపాధ్యాయ సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మహేష్ డేగల కార్యనిర్వాహక కార్యదర్శి కె.చంద్రశేఖర్ పురస్కార గ్రహీత తండ్రి భీమన్నాచార్యులు ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

25న బాబా ఫరీద్ దర్గాలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

ఈనెల 25న మండల పరిధిలోని సిరాలదొడ్డి గ్రామ సమీపంలో వెలిసిన శ్రీ సయ్యద్ బాబా ఫరీద్ స్వామి జయంతి సందర్భంగా దర్గా ఆవరణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు దర్గా పీఠాధిపతి సయ్యద్ సర్పారాజ్ బాబా సాహెబ్, దర్గా నిర్వాహకులు సయ్యద్ నూర్ బాబాసాహెబ్, సయ్యద్ ఖాదర్ బాబా సాహెబ్ లో తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రూ.5 లక్షల చెక్కు అందజేసిన నాగబాబు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఉమ్మడి కర్నూలు జిల్లా లోని వివిధ నియోజక వర్గాలకు చెందిన క్రియాశీలక సభ్యత్వం పొంది ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు ఆదివారం జనసేన పార్టీ మంగళగిరి కేంద్ర కార్యాలయంలోని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు రూ.5 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింతా సురేష్ బాబు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతి ఒక్క జన సైనికుడు క్రియాశీలక సభ్యత్వం బీమా సౌకర్యం పొందాలని కోరారు. జనసేన నాయకులు పివివి సుబ్బయ్య, బజారి తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న నాగబాబు ,సుబ్బయ్య